ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 13 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్షా ఫీజును స్వీకరిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ మెయిన్, రెండో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షా ఫీజును ఈ నెల 16వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పీజీ కోర్సుల పరీక్షల తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షల తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ తదితర కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

బీఎస్సీ ఆనర్స్ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ (సీబీసీఎస్) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

లీడర్‌షిప్ స్వీకరించిన విద్యార్థులతో ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు, పాఠశాల వ్యవస్థాపకుడు కొత్త నాగనాథం

బేగంపేట్ ఆగస్టు 13: విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడానికి ఇలాంటి క్యాబినెట్ లీడర్ల నియామకం దోహద పడుతుందని బేగంపేట్ ట్రాఫిక్ ట్రేనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్రాజు అన్నారు. సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని కొత్త ఎల్లయ్య హైస్కూల్ నిర్వాహకులు మంగళవారం విశ్వకర్మ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవాలు, క్యాబినెట్ లీడర్ల ఇన్వెస్టిగేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆనందింపజేశాయి. ఈ కార్యక్రమానికి ఏసీపీ శంకర్రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాఠశాల వ్యవస్థాపకుడు కార్యదర్శి కొత్త నాగనాథం, కరస్పాండెంట్ శాంతన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనాన్ని త్వరగా పూర్తిచేయాలి

● ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సీతాఫల్‌మండిలో చేపట్టిన కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్,ఆగస్టు 13 : సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో నిర్మిస్తున్న కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణం పనులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గతంలో శిథిల భవనాల్లో కొనసాగిన ఆస్పత్రి పాత భవనాన్ని తొలగించి దాని స్థానంలో రూ.13 కోట్ల ఖర్చుతో అధునాతన హంగులతో మల్టీ స్పెషాలిటి ఆస్పత్రిని నిర్మిస్తున్నామని అన్నారు. ఇదిలా ఉండగా వివిధ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ నిబంధనలు పాటించాలని పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ హేమ, నిర్మాణ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా..

కులమతాలకు అతీతంగా పౌరులందరూ దేశాభివృద్ధికి పాటు పడాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. సీతాఫల్‌మండికి చెందిన వీరమాచినేని పగడయ్య స్కూల్ విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పద్మారావు గౌడ్ సీతాఫల్‌మండి చౌరస్తాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ హేమ, వీరమాచినేని స్కూల్ నిర్వాహకులు రమేశ్‌బాబు, విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ సమన్వయ కర్త రాజాసుందర్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, నాయకులు క్రిష్ణ ముదిరాజ్, బాలాజీ, బెజ్జంకి రాజేశ్, శైలేందర్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి వీరమాచినేని పాఠశాల స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో కలసి తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

రసూల్‌పురాలో నైపుణ్య శిక్షణకేంద్రం ప్రారంభం

శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్, జీస్పాన్ సంస్థ సీఓఓ మోహిత్ మల్లిక్

బొల్లారం, ఆగస్టు 13: మహిళల కోసం ఫ్యాషన్ డిజైన్ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్ అన్నారు. మంగళవారం రసూల్‌పురాలో జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జీస్పాన్ సహకారంతో ఏర్పాటు చేసిన రాణి రుద్రమ దేవి మహిళా సాధికారత, యువత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని జీస్పాన్ సీఓఓ మోహిత్ మల్లిక్ ప్రారంభించారు. జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహ మూర్తి మాట్లాడుతూ.. ఏడాదికి 500 మందికి నూతన కేంద్రంలో డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ స్కిల్స్, ట్యాలీ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణా కేంద్రం దాతలు ప్రకాశ్ బండారి, అవినాష్ బండారి, జీస్పాన్ సంస్థ ప్రతినిధి గౌరవ్, జనహిత సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

ర్యాలీ నిర్వహిస్తున్న సనత్‌నగర్ నియోజకవర్గం హిందూ పరిరక్షణ కమిటీ నాయకులు

అమీర్‌పేట్, ఆగస్టు 13 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల్లో మృతి చెందిన వారికి నివాళిగా సనత్‌నగర్ నియోజకవర్గం హిందూ పరిరక్షణ కమిటీ నాయకులు ఆకుల మహేశ్ ఆధ్వర్యంలో బీకేగూడ జయభారతి స్కూల్ చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హిందూ పరిరక్షణ కమిటీ సీనియర్ నాయకుడు లింగంపల్లి నర్సింగ్‌రావు, నియోజకవర్గం నాయకుడు కాసాని శ్రీశైలంగౌడ్‌తో పాటు సందీప్ వర్మ, వెల్లాల రామ్మోహన్, ఆకూరి శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ, గౌలికార్ ప్రశాంత్, కె.శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లో దేవాలయాలు, హిందువులపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని లింగంపల్లి నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు.

'గాంధీ'లో జూడాల నిరసన

కోల్‌కతాలో ట్రైని వైద్యురాలిపై జరిగిన హత్య, అత్యాచారం ఘటనను నిరసిస్తూ మంగళవారం గాంధీ దవాఖానలో నిరసన ప్రదర్శన నిర్వహించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

– బన్సీలాల్‌పేట్

'మా వాటా మాకే' పుస్తకావిష్కరణ

'మా వాటా మాకే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 13: ప్రముఖ సాహితీవేత్త, రచయిత, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ రచించిన 'మా వాటా మాకే' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఓయూజేఏసీ అధ్యక్షుడు, బీసీ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మెన్ డాక్టర్ ఎల్చల దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీనవేణి రామ్ షెఫర్డ్, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ కాశిం, డాక్టర్ జే వివేక్‌వర్ధన్, డాక్టర్ కొండా నాగేశ్వర్‌రావు, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రఘు తదితరులు విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమానికి రచయిత, సాహితీవేత్తగా జూలూరు గౌరీశంకర్ అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన కలం నుంచి జాలువారిన 'మా వా టా మాకే' పుస్తకాన్ని ప్రతీ ఒక్క బీసీ బిడ్డ చదవాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ వెలువరించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులు ఆర్ఎన్ శంకర్, మండ్ల రవి, బారి అశోక్‌కుమార్, నిరంజన్ యాదవ్, సుధాకర్, వివిధ సంఘాల నాయకులు వెంకట్ ముదిరాజ్, వంశీకృష్ణ, రమణ, రఘు, అవినాశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

దేవనార్ అంధ విద్యార్థుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

బేగంపేట్ ఆగస్టు 13 : బేగంపేట్ దేవనార్ ఫౌండేషన్ ప్రాంగణంలో మంగళవారం కేంద్రమంత్రి రాందాస్ అథవాలే కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. దేవనార్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఫౌండేషన్ ముందుకు సాగడానికి మరింత సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సాయిబాబాగౌడ్, జ్యోతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలంతా వారి వారి ఇండ్ల పై జాతీయ జెండాను ఎగురవేయాలని కంటోన్మెంట్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ జన్యాపుల రామకృష్ణ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహేంద్రాహిల్స్ లోని తన కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని నామినేటెడ్ సభ్యుడు జే రామకృష్ణ పంపిణీ చేశారు. – మారేడ్‌పల్లి, ఆగస్టు 13

ముగిసిన కోటి కుంకుమార్చన మహా యజ్ఞం

స్కందగిరిలోఅభిషేక్ బ్రహ్మచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూర్ణాహుతి మహా యజ్ఞం

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 13 : యువ చేతన సంస్థ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రమణ్య స్వామి దేవాలయంలో ముడు రోజులపాటు జరిగిన శ్రీవిద్య కోటి కుంకుమార్చన మహా యజ్ఞం మంగళవారం ముగిసింది. వారణాసి నుంచి వచ్చిన స్వామి అభిషేక్ బ్రహ్మచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెయ్యి మంది సుహాసినులు శ్రీలలితా సహస్ర పారాయణం చేశారు. సాధువులతో కలిసి కోటి కుంకుమార్చనలో పాల్గొన్నారు. చివరి రోజు హోమం అనంతరం జరిగిన పూర్ణాహుతికి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ నాయకులు మురళీధర్ రావు, చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, యువ చేతన జాతీయ కన్వీనర్ రోహిత్‌కుమార్‌సింగ్, నవీన్ రావు, సుధాకర్ శర్మ, హరినాథ్, జయ్‌పాల్ సింగ్, రోహిత్, రాజీవ్‌రాయ్, ముఖేస్ పాండే హాజరయ్యారు.

సామూహిక జాతీయ గీతాలాపన

గురుగోవింద్‌సింగ్ స్టేడియంలో నిర్వహించిన సామూహిక గీతాలాపనలో వక్తలు

అమీర్‌పేట్, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గం కన్వీనర్ కాసాని శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో సామూహిక జాతీయ గీతాలాపన జరిగింది. మంగళవారం అమీర్‌పేట్ గురుగోవింద్‌సింగ్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు జాతీయ పతాకాలను చేతబూని జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దైవజ్ఞశర్మ విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లు కేతినేని సరళ, చీర సుచిత్ర, పార్టీ నాయకులు మేకల సారంగపాణి, ఎలిగెల దయానంద్, భిక్షపతిగౌడ్, వెల్లాల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలకు తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలి

నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 13: రాష్ట్రంలోని యూనివర్సిటీలకు తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. వీసీలను నియమించడంలో ప్రభుత్వ జాప్యానికి నిరసనగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్సిటీల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీసీల పదవీకాలం ముగిసి మూడు నెలలు పూర్తి అయిన ప్పటికీ ప్రభుత్వం వీసీల నియామకంపై శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో పెంచిన అన్ని ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మెస్ బకాయిలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నవీన్, వంశీ, యశ్వంత్, వికాస్, అరవింద్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

మారేడ్‌పల్లి, ఆగస్టు 13: రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం రైల్వే స్టేషన్ ఔటర్ సిగ్నల్ సమీపంలో రాత్రి 10 గంటలకు గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 30 ఏండ్లు ఉంటుందని, గ్రీన్ టీ షర్టు, బ్లూ ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు వెల్లడించారు. వివరాలకు 9440083160, 8712658581 నంబర్లను సంప్రదించాలని పోలీసులు వెల్లడించారు.

రైల్లో నుంచి జారిపడి చికిత్స పొందుతూ..

మారేడ్‌పల్లి, ఆగస్టు 13 : రైల్లోంచి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ.. మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవయ్యనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 12వ తేదీన రైల్లోంచి ప్రమాదవశాత్తు జారిపడడంతో రెండు కాళ్లు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి వయసు 35 ఏండ్లు ఉంటుందని, బూడిద కలర్ ప్యాంట్, లైట్ గ్రీన్ చొక్కా ధరించి ఉన్నట్లు వెల్లడించారు. వివరాలకు 8712568516, 8712658581నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు పరిధిలోని లోతుకుంట సరస్వతి నగర్ కాలనీలో కంటోన్మెంట్ ప్రభుత్వ దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెడికల్ శిబిరం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ విష జ్వరాలను నివారించేందుకు ఉచిత శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ అవకాశాన్ని బస్తీ, కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు ప్రశాంత్, జేమ్స్,ఏఎన్ఎం బాలమణి కాలనీ వాసులు పాల్గొన్నారు. – బొల్లారం, ఆగస్టు 13

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వైద్యులతో సమావేశమైన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 13: వర్షాకాలం నేపథ్యంలో నగరంలో వైరల్ జ్వరాలు, డెంగ్యూ కేసులు పెరుగుదల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాక డివిజన్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆమె అక్కడి వైద్యాధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో కలియతిరిగి, రోగులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇండ్ల పరిసరాలలో దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జయశ్రీ, డాక్టర్ పల్లవి, ఎంటమాలజీ ఎస్ఈ దుర్గాప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపానికి మరమ్మతులు చేయాలని వినతి

డీసీ సమ్మయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్.యాదగిరి తదితరులు

అడ్డగుట్ట, ఆగస్టు 13 : అమరవీరుల స్తూపానికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మెన్ ఎస్.యాదగిరి కోరారు. సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వద్ద అమరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపానికి మరమ్మత్తులు చేసి ఆధునీకరించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల సమితి ఆధ్వర్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యను కలిసి వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 1969లో క్లాక్‌టవర్ వద్ద పోలీస్ కాల్పుల్లో నలుగురు విద్యార్థులు చనిపోయారని, వారి జ్ఞాపకార్థం అప్పటి ఉద్యమకారులు అమరవీరుల స్తూపాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ప్రస్తుతం స్తూపం వద్ద రేలింగ్ ధ్వంసమై, చెత్తచెదారం పేరుకుపోయిందని తెలిపారు. ఈ విషయమై డీసీ స్పందించి సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చినట్లు యాదగిరి తెలిపారు.వినతిపత్రాన్ని అందజేసిన వారిలో సమితి ప్రతినిధులు రాంరెడ్డి, వెంకటస్వామి, చంద్రన్న ప్రసాద్, కొండస్వామి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు

30 ఏండ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ దక్షిణాది రాష్ట్రాల కోఆర్డినేటర్ రాగటి సత్యం మాదిగ అన్నారు. మంగళవారం బన్సీలాల్‌పేట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబురాల్లో పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

మారమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలను తీసుకువెళ్తున్న భాగ్యనగర్ బోనాల ఉత్సవ సమితి సభ్యులు

బన్సీలాల్‌పేట్, ఆగస్ట్ 13 : భాగ్యనగర్ బోనాల ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బోయిగూడలోని మారమ్మ ఆలయంలో అమ్మవారికి నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంతరావు, న్యాయ సలహాదారు శశిధర్, సభ్యులు రాహుల్, సతీశ్, రమణ, భావేశ్, మోండా డివిజన్ కార్పొరేటర్ కే దీపిక పాల్గొన్నారు.

ఓబీసీ రజక సెల్ కన్వీనర్‌గా రాజేశ్వరి

తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ రజక సెల్ కన్వీనర్‌గా బీజేపీ రాష్ట్ర నాయకురాలు మల్లేశ్వరపు రాజేశ్వరి నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జూపల్లి రాజశేఖర్, సర్వేశ్‌తో పాటు పాల్గొన్నారు. – అడ్డగుట్ట, ఆగస్టు 13

మహంకాళి ఆలయం హుండీ లెక్కింపు

బేగంపేట్ ఆగస్టు 13 : సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయం హుండీని దేవదాయ శాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. 63 రోజులకుగానూ హుండీ ఆదాయం రూ.75,30,155లు లభించినట్టు ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఫౌండర్ సభ్యులు సురిటీ కామేశ్, రామేశ్వర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అవయవ దానంతో మరికొందరికి పునర్జన్మ : డాక్టర్ ఇందిర

దాతల కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర

బన్సీలాల్‌పేట, ఆగస్టు 13 : బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను దానం చేయడం ద్వారా మరికొందరికి పునర్జన్మ ఇవ్వవచ్చని, అలాంటి దాతల ఔదార్యాన్ని వారి కుటుంబ సభ్యుల సామాజిక స్పృహను, పెద్ద మనస్సును అభినందిస్తున్నామని గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర అన్నారు. తెలంగాణ అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో జాతీయ అవయవ దాన దినాన్ని పురస్కరించుకుని మంగళవారం సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల ఆడిటోరియంలో దాతల అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు డాక్టర్ కె.భారతి మాట్లాడుతూ.. అవయవదానానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ దవాఖానల్లో జీవన్‌దాన్ ద్వారా 2022 జూలై నుంచి 2023 మార్చి వరకు బ్రెయిన్ డెడ్ అయిన 1,465 దాతల నుంచి సేకరించిన 5,541 అవయవాలను ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి అనేక మందికి పునర్జన్మను అందించామన్నారు. జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారికి వరుస క్రమంలో అవయవ మార్పిడి చేయడం కొనసాగుతున్నదని తెలిపారు. శరీర దాత